www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 4 ఏప్రిల్ 2023

5



కోనసీమ

న్యాయం అడిగితే కేసులు పెడతారా...

ప్రజాశక్తి - మండపేట

సమస్యపై పోరాటం చేస్తున్న ముస్లిం నేతలపై కేసులు బనాయించడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు అధికారులు సర్వే పూర్తి అయ్యే వరకు నిర్మాణాలు నిలిపివేయాలని సూచించినప్పటికీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణదారులు పట్టించుకోకపోవడంతోనే ముస్లిములు నిరసన వ్యక్తం చేశారన్నారు. అధికారులు కళ్లున్న కబోదుల్లా మారడంతోనే ముస్లిం సమాజం రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. సర్వే పూర్తయ్యే వరకు నిర్మాణం అడ్డుకోకపోగా ముస్లిములపై కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. దీనిపై డిఎస్పి కలుగజేసుకుని తక్షణం కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేసులు ఉపసంహరించుకోకపోతే ఆందోళనకు దిగుతామన్నారు.

అల్లర్ల కేసుల ఎత్తివేతపై ఆగ్రహం

ప్రభుత్వమే నేరస్తులను కాపాడడం సిగ్గుచేటు
సర్కారు నిర్ణయానికి వ్యతిరేకంగా కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి - అమలాపురం

కోనసీమ అల్లర్లలో నిందితులపై కేసుల ఎత్తివేత ప్రకటనపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి అందించారు. జిల్లా వ్యాప్తంగా దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అసాంఘిక శక్తులు అమాయకులా..?, నేరస్తులను కాపాడడం సిగ్గుచేటు, దళితుల పంతం జగన్ అంతం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ అమలాపురంలో ముందస్తు ప్రణాళికతో కొంత మంది అల్లర్లు సృష్టించారన్నారు. మంత్రి, ఎంఎల్ఎ ఇళ్లను నిప్పుటించడమే కాకుండా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారన్నారు. జిల్లా ఎస్పీతో సహ పోలీసులపై విచక్షణారహితంగా దాడి చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి రణరంగం సృష్టించారన్నారు. అలాంటి అసాంఘిక శక్తులను, నేరస్తులను చట్ట ప్రకారం శిక్షించకుండా కేసులు ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇది అన్యాయమని రాజ్యాంగాన్ని చట్టాలను అపహాస్యం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వంలో ఉన్న పోలీస్ యంత్రాంగం నేరస్తులను పట్టుకుంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఇది పోలీసు వైఫల్యం అని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నేరస్తులను అమాయకులని చెప్పడం దారుణమన్నారు. అందరూ అమాయకులు అయితే అసలు దోషులు ఎవరని ప్రశ్నించారు. మంత్రికి, ఎంఎల్ఎకి న్యాయం జరక్కపోతే రాష్ట్రంలో ఉన్న దళితులకు రక్షణ ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేరస్తులను మరిన్ని నేరాలు చేసే విధంగా జగన్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అమలాపురం అల్లర్ల కేసుల ఎత్తివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అల్లర్లు సృష్టించిన నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ముందస్తు ప్రణాళిక చేసిన సూత్రధారులను, పాత్రధారులను అరెస్టు చేయాలన్నారు. అమలాపురం అల్లర్ల ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దమనకాండను అరికట్టాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 28 దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులందరూ ఐక్యంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక చైర్మన్ డి.బి.లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, రేవు తిరుపతిరావు, బొంతు రమణ, గిడ్డి వెంకటేశ్వరరావు, గెడ్డం సురేష్ బాబు, నెల్లి లక్ష్మీపతి, పొలమూరి మోహన్‌బాబు, నూతనపాటి వివేక్, నక్క సంపతకుమార్, మెండు రమేష్ బాబు, బొంతు బాలరాజు, దేవరపల్లి శాంతికుమార్, పరమట భీమమహేష్, జై భీమ్ చంద్ర పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు



అమలాపురంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

పది పరీక్షలు ప్రారంభం

తొలి రోజు 99 శాతం హాజరు

ప్రజాశక్తి - అమలాపురం

పదో తరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 18,959 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 18,864 మంది పరీక్ష రాశారని డిఇఒ తెలిపారు. 95 మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ 48 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిందని డిఇఒ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్ష నిర్వహణను కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. స్ట్రాంగ్ పాయింట్ల నుంచి ప్రశ్నాపత్రాలను తరలింపు చర్యలపై చీఫ్ సూపరింటెండెంట్, విద్యాశాఖ అధికారులను ఆరా తీశారు. బందోబస్తు ఎస్కార్ట్ నడుమ ఫ్లోర్ట్ వాహనాల్లో ప్రశ్న, జవాబు పత్రాలను తరలించాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు మధ్య పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా పరీక్షలను రాయాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్, హెచ్‌ఎం ఎస్ఎల్‌వి.బాల మాట్లాడుతూ ఈ పాఠశాలలో 219 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. చింతల్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పివి.రవిప్రసాద్ డిపార్ట్‌మెంటల్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

మండపేట : మండలంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 1021 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 732 మంది పరీక్షలు రాస్తున్నారు. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజర్ య్యారని ఎంఇఒ నాయుడు రామచంద్రరావు తెలిపారు.

కొత్తపేట : మండలంలోని 5 సెంటర్లలో జరిగిన తొలిరోజు తెలుగు పరీక్షకు 914 మంది విద్యార్థులకు 911 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఒ ఎం.ప్రసాద్ అన్నారు.

కాట్రేనికోన : పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్, అల్లవరం ఎంఇఒ కె.కిరణ్‌కుమార్ అన్నారు. కందికుప్ప, కాట్రేనికోన, చెయ్యేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. కందికుప్ప, కాట్రేనికోన పరీక్ష కేంద్రాల్లో మొదటిరోజు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

కపిలేశ్వరపురం : అంగర జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదోతరగతి పరీక్షలకు 356 మంది, కపిలేశ్వరపురం పరీక్ష కేంద్రంలో 156 మంది పరీక్ష రాశారని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ కె.సూర్యారావు తనిఖీ చేశారు.

ఉప్పలగుప్తం : మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి, చల్లపల్లి జడ్‌పి పాఠశాలల్లో పదోతరగతి పరీక్షలు జరిగాయి. 599 మందికి 598 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు.

'చలో ఢిల్లీ'కి పయనం

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ఏప్రిల్ 5న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సోమవారం అమలాపురం నుంచి బయలుదేరారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా లక్షలాది మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారన్నారు. దేశ ప్రజలపై ఎక్కువ పన్నులు మోపడంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కౌలు రైతులకు రక్షణ లేదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తోందన్నారు. కేంద్రం విధానాలతో రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని, దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. ఈ ప్రజా వ్యతిరేక, మతోన్మాద, నియంతృత్వ బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పకపోతే ఈ దేశ సంపద అంతా అదానీ, అంబానీల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.వసంత్‌కుమార్, కె.బేబీగంగారత్నం, జి.దుర్గ ప్రసాద్, రాంబాబు, పాము బాలయ్య, పీతల రామచంద్రరావు,పాల్గొన్నారు.



ఢిల్లీకి పయనమవుతున్న వివిధ సంఘాల నాయకులు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

ముందుకు సాగని టిడ్కో పనులు

ప్రజాశక్తి - మండపేట

మండపేటలో టిడ్కో ఇళ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం టిడ్కో గృహాల సముదాయాన్ని స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ నివాసం ఉంటున్న వారిని కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం సమయంలో నీటి కొరత వుందని వారు ఆయనకు చెప్పారు. కొంతమంది ఫ్లాట్ల లబ్ధిదారులు కుళాయిలు వదిలేసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు ఆయనకు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడారు. టిడ్కో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఫ్లాట్లు అప్పగించకపోవడంతో లబ్ధిదారులు ఇంకా అద్దె ఇళ్లలోనే ఉంటున్నారన్నారు. ఫ్లాట్లు పొందిన లబ్ధిదారులు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నీళ్ల సమస్యను పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, నాయకులు వాదా ప్రసాదరావు ఉన్నారు.

కార్టూ'నిజం'



మన అసలు స్థానం ఇది కూడా కాదేమో సార్..!!

మహిళకు పోలీసుల అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

తనకు దొరికిన బంగారు నగలను నిజాయతీగా పోలీసులకు అప్పగించిన మహిళను పలువురు అభినందించారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు అయినవిల్లికి చెందిన యడ్ల సత్యవేణి తన కుటుంబ సభ్యులతో కలసి చింతలూరు నూకాంబిక అమ్మవారి దర్శనానికి ఆదివారం వచ్చారు. ఈ క్రమంలో సుమారు రూ.1.30 లక్షల విలువ చేసే మూడు కాసుల బంగారపు పుస్తెల తాడును పడేసు కున్నారు. అదే రోజున తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తాళ్లపాలేనికి చెందిన సింగులూరి మల్లేశ్వరి అమ్మవారి దర్శనానికి వచ్చింది. బంగారు పుస్తెల తాడు ఆమెకు దొరికింది. ఆలయం వద్ద బందోబస్తులో ఉన్న ఎస్ఐ శివప్రసాద్‌కు దీనికి ఆమె అందించింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మైకుల ద్వారా ఈ మేరకు ప్రకటన చేశారు. ఎవరూ రాకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో వస్తువును భద్రపరిచారు. సోమవారం బంగారపు పుస్తెలతాడు తమదేనంటూఇ యడ్ల సత్యవేణి ఆధారాలను పోలీసులకు చూపింది. దీంతో ఆమెకు వస్తువును అప్పగించారు. ఈ సందర్భంగా నిజాయతీగా వస్తువును అందించిన మల్లేశ్వరిని స్థానిక పోలీస్ స్టేషన్లో అభినందించి, ఘనంగా సత్కరించారు.

నిర్ణీత గడువులో అర్జీల పరిష్కారం

అమలాపురం : స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోకి పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ స్పందన సమావేశపు హాల్లో జెసి ధ్యానచంద్ర, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబులతో కలసి ఆయన స్పందనలో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సోమవారం 236 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, సిపిఒ వెంకటేశ్వర్లు, డిఎంఅండ్‌హెచ్ఒ ఎం.దుర్గారావుదొర, డిటిఒ ఎ.అశోకప్రతాపరావు, వ్యవసాయ శాఖ జెడి కె.నాగేశ్వరరావు, డిఎస్ఒ ఎ.పాపారావు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు అభినందన

కాట్రేనికోన : చెయ్యేరులో శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ సివిల్ విభాగంలో 2017 -2021 విద్యా సంవత్సరంలో జెఎన్‌టియుకె టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్‌ను సాధించిన సిహెచ్.సాయిసౌమ్యను, డిప్లొమా ద్వితీయ సంవత్సరం ఇసిఇలో 93.4 శాతం మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి డి.శశివర్మను సోమవారం ఘనంగా సత్కరించారు. ఎయు మాజీ విసి, ప్రసూతా సెంచూరియన్ యూనివర్సిటీ విసి జిఎస్ఎన్.రాజు, జెఎన్‌టియుకె ప్రొఫెసర్ డాక్టర్ వి.రవీంద్ర విద్యార్థులను సత్కరించారు. వారికి ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్‌విఎస్ఎస్.రామచంద్రరాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ బి.రత్నరాజు, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్‌రాజు, కళాశాల డైరెక్టర్ ఎస్.వాసుదేవరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలపై అవగాహన

కాట్రేనికోన : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సోమవారం మండల పరిషత్ సమావేశపు హాల్లో ఎఒ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎఒ మాట్లాడారు. కొనుగోలులో కస్టోడియన్ అధికారులు, మిల్లర్ల పాత్రను వివరించారు. తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ గోనెసంచులను ప్రతి ఆర్‌బికెకు సరఫరా చేస్తామన్నారు. ఎంపిడిఒ కె.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఆర్‌బికె వద్ద జట్టు కూలీలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిఇఒలు, విఆర్ఒలు, విఎఎలు, విహెచ్ఎలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కక్ష పూరిత పాలన

అమలాపురం రూరల్ : రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చాలా దుర్మార్గంగా, కక్ష పూరితంగా పాలన సాగిస్తుందని టిడిపి అమలాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సోమవారం కామనగరువులో బిసి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి రాజులపూడి భీముడు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రచ్చ బండలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మార్పు మొదలైందని, ఇటీవల ఎంఎల్‌సి ఎన్నికలే దీనికి నిదర్శనమన్నారరు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోలయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు కె.రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రమౌళి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గెద్దయ్య, మాజీ ఎంపిపి ఈశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలో పూతరేకులకు భౌగోళిక గుర్తింపు

అమలాపురం : ఆత్రేయపురం పూతరేకులకు త్వరలో జిఐ(భౌగోళిక గుర్తింపు) త్వరలో రానుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన మేథో సంపత్తి హక్కుల సభ్యులు మాకిరెడ్డి మనోజ్, గాదిరాజు ప్రసాద రాజులు భౌగోళిక గుర్తింపు(జిఐ) జర్నల్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా వారికి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుచిలో అద్భుతం, మైమ రిపించే మాధుర్యం ఆత్రేయపురం పూతరేకులు సొంతం అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన ఆత్రేయపురం పూత రేకులకు వాణిజ్య పరిశ్రమల శాఖ వారు జారీ చేసే భౌగోళిక గుర్తింపు (జిఐ) కోసం జరుగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చాయన్నారు. మరో నాలుగు మాసాల్లో గెజిట్ నోటిఫికేషన్ వస్తుందన్నారు. ఆత్రేయపురానికి చెందిన సర్ ఆర్థర్ కాటన్ పూతరేకుల సహకార సంఘం వారు విశాఖపట్నం దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం సహకారంతో భౌగోళిక గుర్తింపు కోసం చేసుకున్న దరఖాస్తుకు సంబంధించి పలు పరిశీలనలు పూర్తయ్యాయన్నారు.

స్పందనకు 5 అర్జీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఐదు అర్జీలు అందాయని ఆర్‌డిఒ సింధు పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు అర్జీలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల తొలగింపు వెంటనే ఆపాలి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం రూరల్ ఈదరపల్లి కుమ్మరికాలువ గట్టున ఆనుకుని ఉన్న ఇళ్ల తొలగింపు తక్షణం ఆపాలని ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద స్థానికులు ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంఘటనా స్థలాన్ని పరిశీలించి తొలగింపులు ఆపుతామని, మరో చోట ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, ఐద్వా మండల అధ్యక్షులు ఎ.రత్నకుమారి, స్థానికులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ అన్నారు. మండలంలోని మడికి నుంచి జొన్నాడ వరకు గల 216ఎ నెంబరు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను ఆయన తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై వ్యతిరేక దిశలో వస్తున్న పలు వాహనాలను ఆపి వారికి అవగాహన కల్పించి, అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ రవి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రాస్తారోకోపై కేసు నమోదు

ప్రజాశక్తి - మండపేట

రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారనే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు స్థానిక కలువపువ్వు సెంటర్ వద్ద మసీదు చెంతనే నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ విషయంలో సమీప జంక్షన్‌లో సయ్యద్ ఖాదర్, షేక్ షరీఫ్, షేక్ సంధాని, షేక్ మదీనా, షేక్ షరీవ్, సయ్యద్ హల్తావ్ రాస్తారోకో చేశారు. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని విఆర్ఒ సామన అనుపమదేవి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కౌన్సిలర్ శ్రీనివాసుకు చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

అనారోగ్య కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూకదుర్గారాణి సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతను కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, మొండి భవాని, వార్డ్ ఇన్‌ఛార్జి కొప్పిరెడ్డి పద్మావతి, యరమాటి వెంకన్నబాబు, వైసిపి నాయకులు మలసాని అప్పన్న తదితరులున్నారు.

మసీదులో డిజిటల్ సర్వే

ప్రజాశక్తి - మండపేట

స్థానిక కలువ పువ్వు సెంటర్లోని మసీదు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ ఆదివారం ముస్లిములు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో తహసీల్దార్ తంగెళ్ల రాజరాజేశ్వరరావు ఆదేశాల మేరకు మండల సర్వేయర్ మహ్మద్ ఖురేషి జామియా మసీదులో సోమవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. మసీదు ఎంత విస్తీర్ణం ఎంత వాడుకలో ఉంది తదితర విషయాల నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తామన్నారు. ఈ సర్వేలో జెడ్ మేడపాడు, ద్వారపూడి గ్రామాల విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

దాడిపై న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- రామచంద్రపురం

న్యాయవాది దుగ్గిరాల సుభాష్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ సోమవారం రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. పోలీసుల తీరును ఖండించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహయ కార్యదర్శి సాదే నారాయణ, కోశాధికారి నేలపాటి వీరభద్రరావు, చిన్నం వీర్రెడ్డి, వాడ్రేవు సాయిప్రసాద్, పోలిశెట్టి శ్రీనివాస్, వాకలపూడి జయశంకర్, కముజు సూర్య నారాయణ, కె.లోవరాజు, చోడే జాన్‌రత్నం, దాసరి జగదీష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న తెప్ప ఉత్సవం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవాల్లో భాగంగా సోమ వారం రాత్రి తెప్ప ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుదర్శన మురళీకృష్ణా చార్యులు అర్చక బృందం అమలాపురం పట్టణానికి చెందిన రాపాక సత్యనారాయణ మూర్తి కుటుంబ సభ్యులు ఈ ఉత్సవాన్ని జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీన్ని తిలకించారు. పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన పంటుపై ఈ ఉత్సవం జరిగింది. జిల్లా ఎండోమెంట్ అధికారి కెవిడి.దుర్గాప్రసాద్, ఆలయ చైర్మన్ దూడల విరీతదేవిఫణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తెప్పపై ఊరేగుతున్న వెంకన్న

బ్రెయిన్ స్ట్రోక్ బాధితునికి సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడు కడలి గోవిందుకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ గోవింద్ తన మిత్రుల సాయంతో నిత్యావసర సరకులు, ఆర్థిక సాయం అందించారు. సోమవారం హైదరాబాద్‌లో ఉంటున్న కడలి గోవింద్ ఇంటికి వెళ్లి ఈ సాయం అందించారు. పరిస్థితిని ఫోన్‌లో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు వివరించామని, ప్రభుత్వం నుంచి సాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని శ్యామ్ విలేకరులకు తెలిపారు.



సాయం అందిస్తున్న శ్యామ్

పాలక వర్గానికి అభినందన సభ

ప్రజాశక్తి - రామచంద్రపురం

సర్పంచ్, వార్డ్ సభ్యులుగా ఎన్నికైన సోమవారానికి రెండేళ్లు పూర్తి చేఉకున్న సందర్భంగా హసన్‌బాద పంచాయతీ సెక్రటరీ భాస్కరలక్ష్మి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావును, వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న వార్డు సభ్యులకు, పంచాయతీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యకుమారి, వైస్ ప్రెసిడెంట్ నీలం గంగా భవాని, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ వికలాంగులకు బస్‌పాస్‌లను అందించారు. అలాగే వెల్ల పంచాయతీలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాయుడు ఈశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.




కేకు కట్ చేస్తున్న సర్పంచ్

'నూకాంబిక'కు రూ.22.66 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబికా ఆలయా నికి హుండీల ద్వారా రూ.22, 66,189 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వీర్రాజుచౌదరి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆలయంలో ఏడు హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించామని తెలిపారు. రామచంద్రపురం దేవాదాయ శాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ సమక్షంలో ఈ లెక్కింపు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌శ్రీనివాస్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



లెక్కింపులో పాల్గొన్న ఆలయ అధికారులు, సిబ్బంది

నేరాలు ఘోరాలు

యానాంలో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణపరిధిలో యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు యానాం పోలీసులు తెలిపారు. మెట్టకూరు గ్రామపరిధిలోని వంశీకష్ణ కాలనీకి చెందిన సూరిశెట్టి వెన్నెల (18) తన స్వగృహంలోనే ఫ్యాన్ చున్నీని బిగించి ఆత్మహత్య పాల్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు గమనించి ఆమెను యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చినప్పటికి అప్పటికే ఆమె మతిచెందిందని వైద్యులు ధ్రువీకరించారు. వెన్నెల యానాం డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతుందన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు గూర్చి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు.ఎస్సై శేరు నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సూరిశెట్టి వెన్నెల

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మ్యదాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. అందులో రూ.9వేల విలువ గల ఇంపీరియల్‌బ్లూ 180 ఎంఎల్ 18 బాటిల్స్ మెన్స్ ఛాయిస్ 180ఎంఎల్, 96 బాటిల్స్ ఉన్నాయన్నారు.

బైకు నుంచి జారి పడి మహిళ మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వల్లూరు, వెదురుమూడి ఆర్ అండ్ బి రహదారిలో బైకు నుంచి జారిపడి వివాహిత మరణించింది. అంగర ఎస్ఐ బి.చంటి తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురం నుంచి చింతలూరు వెళ్లేందుకు వెలుగుబంటి శిరీష (23) భర్త శ్రీనివాస్ వారి ఇద్దరు చిన్నారులతో బైకుపై బయలుదేరారు. చింతలూరు వెళ్లాల్సిన వారు వల్లూరు వైపు వెళ్లిపోయారు. విషయం తెలుసుకుని వెనక్కి వస్తుండగా వల్లూరు, వెదురుమూడి మధ్యలో బైకు గోతిలో పడింది. దీంతో శిరీష రోడ్డుపై జారి పడి తలకు తీవ్ర గాయమయ్యింది. ఆమెను మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంటి తెలిపారు.

లారీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చాగల్లు

బ్రాహ్మణగూడెం ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం ఆటోను క్వారీ లారీ ఢీకొని ఆటోలో ఉన్న జక్కుల జార్జి (65) మతి చెందినట్లు ఎస్ఐ సిహెచ్ వి.,రమేష్ తెలిపారు. మార్కొండపాడు గ్రామ శివారు కుంకుడిమిల్లి చెందిన ఆటోలో జార్జి నిడదవోలు బ్యాంకుకి వెళ్లి తిరిగి వస్తుండగా పంగిడి నుంచి నిడదవోలు వైపు వస్తున్న క్వారీ లారీ ఆటోను బలంగా ఢీకొనడంతో జార్జి మరణించాడు. ఆటో డ్రైవర్‌కు గాయాలైనట్టు ఎస్ఐ తెలిపారు.


నిందితునితో పోలీసులు

దమ్ము చక్రాల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని ఉండ్రాజవరం, పాలంగి, తాడిపర్రు గ్రామాల పరిధిలో ట్రాక్టర్ దమ్ము చక్రాల చోరీ కేసులో నిందితుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.రామారావు తెలిపారు. సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కె.సావరం గ్రామానికి చెందిన కొండేటి ఆదినారాయణను అదుపులోనికి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 దమ్ము చక్రాలు, ఒక వ్యాన్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

250 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక కస్తూర్బా ఆశ్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ సత్యం రమేష్ బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ పాల్గొని సుమారు 250 మంది రోగులకు వైద్యం అందించారు. అవసరమైన మందులను అందించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి వేమగిరి కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ వైద్య శిబిరంలో సుందరపల్లి సుధాకర్, కె.శ్రీనివాస్, వై.వెంకటనారాయణ, చంటిబాబు పాల్గొన్నారు.

రామాలయాల వద్ద అన్నదానం

ప్రజాశక్తి-దేవరపల్లి

మండలంలో దేవరపల్లి, యర్నగూడెంలో సోమవారం శ్రీరామనవమి పండుగ ముగింపులో భాగంగా స్థానిక గ్రామాల్లో ఉన్న రామాలయాల వద్ద భారీ అన్నదానం నిర్వహించారు ఈ అన్నదానంలో గ్రామస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కాకినాడలో ది కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయం


తమ సొమ్ములు ఇప్పించాలంటూ బ్యాంకు వద్ద కూర్చున్న డిపాజిటర్లు


బ్యాంకులో రికార్డులు తనిఖీ చేస్తున్న విచారణాధికారులు

అధిక వడ్డీ ఆశ చూపి.. డిపాజిటర్లకు కుచ్చుటోపీ

- ది కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ నిర్వాకం
- 150 మంది లబ్ధిదారుల గుర్తింపు
- రూ.6 కోట్లకు పైగా బకాయిలు గుర్తించిన అధికారులు
- సుమారు రూ.10 కోట్లకు పైనే డిపాజిట్లు ఉంటాయని అధికారుల అంచనా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కుటుంబంపై ఆధారపడకుండా వచ్చిన వడ్డీతో తను బతకాలని కాకినాడ చీడిక గ్రామానికి చెందిన లక్ష్మీ దుర్గ తన దగ్గర ఉన్నరెండు లక్షలను డిపాజిట్ చేసివచ్చిన పింఛన్‌తో బతుకుతెరువు సాగిస్తోంది. సమయం పూర్తయినతమ డబ్బులు కోసం మూడు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరిగినా డబ్బులు ఇవ్వడం లేదు. అసలు సంగతి తెలుసుకుని ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- పిల్లల చదువుతోపాటుగా, కుమార్తె పెళ్లి చెయ్యాలని తన దగ్గర ఉన్న ఆరు లక్షల పైగా సొమ్మును డిపాజిట్ చేసి మోసపోయిన కాకినాడకు చెందిన నాగేశ్వరరావు మరో కథ ఇది.

అధిక వడ్డీ ఆశ చూపి ప్రైయివేటు బ్యాంకులో డిపాజిట్లు చేసిన సుమారు 300 మందికి పైగాలబ్ధిదారుకు కుచుచ టోపీ పెట్టేందుకు సిద్ధమైన ది కార్తికేయ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వ్యవహారంపై సహకారశాఖ విచారణ చేపట్టింది. విచారణ అధికారిగా జిల్లా సహకార సొసైటీ అధికారి దుర్గాప్రసాద్ తమ సిబ్బందితో బ్యాంకుకు చేరుకుని బ్యాంకులో ఉన్న పలు పత్రాలను తనిఖీ చేశారు. దీంతోపాటుగా లబ్ధిదారులను ఎంతెంత డిపాజిట్లు చేశారో అనే దానిపై రాతపూర్వకంగా వివరాలు సేకరిస్తున్నారు. కాకినాడలో 20 సంవత్సరాల క్రితం కోడి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్లింగ్ సొసైటీ రిజిస్ట్రేషన్ జరిగింది. గతంలో కార్యకలాపాలు సజావుగానే జరిగేవి. కరోనా సమయంలో జయలక్ష్మి సొసైటీ బాగోతం బయటపడటంతో డిపాజిట్ దారులు తమ సొమ్ములు చెల్లించాలంటూ ఒత్తిడి తెచ్చారు. అయితే గత మూడు నెలల నుంచి లబ్ధిదారులకు బ్యాంకు నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో పాటుగా బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా విచారణ చేపట్టిన పోలీస్, సహకార శాఖ అధికారులు సోమవారం బ్యాంకుకు చేరుకుని పలు పత్రాలను తనిఖీ చేశారు.

249 సెల్‌ఫోన్ల రికవరీ

- మొబి ట్రాక్ తప్పకుండా వినియోగించుకోవాలి
- ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

దొంగలించబడ్డ ఫోన్లను మొబి ట్రాక్ కాకినాడ పోలీస్‌లు రికవరీ చేసి పోగొటుటకున్న బాధితులకు జిల్లా ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు అందజేశారు. సోమవారం కాకినాడ జిల్లా ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను మొబి ట్రాక్ ద్వారా కనిపెట్టి 249 మంది బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కాకినాడలో ఏర్పాటు చేసిన మొబి ట్రాక్ కాకినాడ పోలీస్ సేవలను కాకినాడ ప్రజలు ఎంతో సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారన్నారు. ఐటీ కోర్ టీం, సిసిఎస్ బృందాలను సమన్వయం చేసుకుంటూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిబ్బంది సంయుక్త కృషితో సమర్థవంతంగా ఈ సేవలను అందిస్తు న్నామన్నారు. బాధితులు పోగొట్టుకున్న ఫోనులను రూ.37,35,000 ఉంటాయన్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు 339 సెల్ ఫోన్ బాధితులకు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి శ్రీనివాస్ డిఎస్‌పిలు అంబికా ప్రసాద్, పి.మురళీకష్ణ రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌సెక్టర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


రికవరీ చేసిన ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు

ధవళేశ్వరం నుంచి పైపులైన్ నిర్మించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రిలయన్స్, ఒఎన్‌జిసి సాగునీటి కోసం ధవళేశ్వరం నుంచి నేరుగా పైపులైను నిర్మించుకోవాలని దరియాల తిప్ప రైతు సంఘం మాజీ అధ్యక్షులు మల్లాడి సత్తిబాబు డిమాండ్ చేశారు. తాళ్లరేవు నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద రిలయన్స్ పంపింగ్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో సత్తిబాబు మాట్లాడారు. చమురు సంస్థలైన రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థల వల్ల తాళ్లరేవు మండలానికి, అటు పుదిచ్చేరి యానాంకు సాగునీటి ఎద్దడి తలెత్తుతోందని, ఈ చమురు సంస్థలు ధవళేశ్వరం నుంచి నేరుగా పైపులైన్ నిర్మించి తమ కోటాలో వచ్చిన సాగునీరు 50శాతం రైతాంగానికి ఇచ్చి, మిగిలిన సాగునీరు వాటి అవసరాలకు వినియోగించు కోవాలన్నారు. అలా కాకుండా, తాళ్లరేవు మండలం మల్లం కోట లాకుల వద్ద ఒఎన్‌జిసి సాగునీరును అన్యాయంగా తరలించకపోతుందని, సైఫాన్ తూము దాటి అతి కష్టంగా వచ్చిన మిగిలిన సాగునీరును రిలయన్స్ సంస్థ రైతుల నడ్డి విరిచి సాగునీటిని తరలించకపోతోందని అన్నారు. ఈ రెండు సంస్థల వల్లే మండలంలోని వేలాది ఎకరాలకు, సాగునీరు అందక పంటలు బీటలు వారు తున్నాయన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి సాగునీటి ఎద్దడిని అరికట్టాలని డిమాండ్ చేశారు.

న్యాయవాదులపై దాడులకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో న్యాయవాది హత్య, రాజమండ్రి న్యాయవాదిపై పోలీసులు దాడులకు వ్యతిరేకంగా ప్రతిపాడులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం న్యాయమూర్తి కాటం భానుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ మాట్లాడుతు పోలీసులు న్యాయవాదిపై దాడి చేసి గాయపరచడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ సంఘటనకు కారుకులను కఠినంగా శిక్షించడంతో పాటు న్యాయవాది రక్షణ చట్టాన్ని వెంటనే రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ఆడారి సుగుణ, కోశాధికారి ఆర్ వెంకట్రావు, సహాయ కార్యదర్శి రాయి శ్రీనివాసరావు, కల్చరల్ కార్యదర్శి జి సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు అవసరాల దేవి, చిట్టంశెట్టి పుల్లయ్య, ఏ కుక్కుటేశ్వర రావు, జోగేష్, సజన, నాగేంద్ర, మల్లేశ్వంరావు, లోవదుర్గ, కాపిశెట్టి శ్రీనివాస్ ఆకుల హరిబాబు ఉన్నారు.


న్యాయమూర్తి భానుకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

దస్తావేజులు పోయినవి

శ్రీమతి పెదపాటి నాగమణి, భర్త : బాబూరావు, వయస్సు : 51 సం॥రాలు, తిమ్మరాజుపాలెంగ్రామం, నిడదవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ అను నేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నాకు చెందిన ఒరిజినల్ దస్తావేజు(నెం.1883/2015), దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు (1) దస్తావేజు నెం.1608/2013, (2) దస్తావేజు నెం.2124/2012, (3) దస్తావేజు నెం. 281/1984 గా ఉండి ఉన్నవి. జిరాక్స్ నిమిత్తం మా ఇంటి వద్ద నుండి నిడదవోలు పట్టణంకి మోటారు సైకిల్‌పై వస్తుండగా పడిపోయినవి. ఎంతవెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో పైన తెలిపి చిరునామాకు అందచేయగలరు.

టిడిపితోనే సంక్షేమ పాలన సాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజా సంక్షేమ పాలన కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎంఎల్ఎ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వనమాడి కొండబాబు తెలిపారు. వైసీపీ పాలనలో ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ - మన కాకినాడకు కార్యక్రమంలో సోమవారం 27 వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, సాయిబాబా, కోడూరు కుమారస్వామి (పెద్ద), బుంగా నూకాలమ్మ, అందనాపల్లి శ్రీనివాస్, సూరాడ అప్పారావు, నామాల మల్లి, నాగమణి, కోడూరు ప్రసాద్, దేవి తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడి హయాంలో నగరాభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గడిచిన నాలుగేళ్ల కాలంలో నగరంలో చేసిన అభివృద్ధి శూన్యమని టిడిపి కాకినాడ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుంకర పావని విమర్శించారు. కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక జగన్నాధపురం లోని ఎన్‌టిఆర్ వారధి కుంగిపోతే ఆ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు రాకుండా కార్పొరేషన్ ఖజానా నిధులను వినియోగించడం వల్ల కార్పొరేషన్ దివాలా తీసిందని దీనికి ఎంఎల్ఎ ద్వారంపూడి వైఖరియే కారణమని పావని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహ సముదాయాన్ని నిర్మిస్తే అది నేటికీ కూడా 1200 మంది లబ్ధిదారులకు అందించడంలో ఎంఎల్ఎ ద్వారంపూడి విఫలం చెందారన్నారు. నగరంలో పేద ప్రజలకు ఇల్లు ఇచ్చానని చెబుతున్న వైసిపి నేతలు అది ఎక్కడ ఇచ్చారో ఆ ఇళ్లపై సంతప్తి చెందామంటూ లబ్ధిదారులతో చెప్పించగలరా అని పావని ప్రశ్నించారు. కాకినాడ నగరంలోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ చెందిన ఖాతాదారుల భవిష్యత్‌ను అతను పట్టించుకోకపోవడంతో మరో ఇదే తరహా కార్తికేయ బిల్డింగ్ సొసైటీ కూడా దివాలా తీసే దశలో ఉందని ఆమె చెప్పారు. సమావేశంలో చాపల లీలా ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్ సర్టిఫికెట్లు పడిపోయినవి

సుంకర శ్రీవెంకటలక్ష్మి విజయ కుమార్, తండ్రి: శ్రీనివాస్, డోర్ నెంబర్: 2-54, మెరక వీధి, కేశవరం, మండపేట మండలం, డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్. నా యొక్క పదవ తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లను జిరాక్స్ నిమిత్తం కేశవరం నుండి మండపేట మోటార్ సైకిల్ వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

10th Mark List Bearing No. 1809117616, Intermediate Mark List Registered No. 2003254435.

సుంకర శ్రీవెంకటలక్ష్మి విజయ కుమార్
తండ్రి: శ్రీనివాస్, డోర్ నెంబర్: 2-54,
మెరక వీధి, కేశవరం, మండపేట మండలం,
డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
సెల్: 81859 32767


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అపోలో వైద్యులు

ఆదిత్య ఫార్మసీలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ అఫ్ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.కె.రవిశంకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో అపోలో హాస్పటల్ వైద్యులు ఎం.ప్రవీణ్ కుమార్, ఇ.సుభాష్, శ్రీధర్‌లు మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బ, జ్వరాలు వంటి సంబంధించిన ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురించి వివరించారు బలహీనంగా ఉన్న విద్యార్థులకు ఐరెన్ టాబ్లెట్లు, సిరప్ లను అందించారు. ఎన్. ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు భీమోలు రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తిగోపాలపురం

భీమోలు నుంచి గోపాలపురం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రయాణులకు ఇబ్బందులకు తెరపడిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. భీమోలు గ్రామం నుండి ప్రజలు గోపాలపురంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యం పలు అవసరాల నిమిత్తం రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా భీమోలు గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధితులు అత్యవసర సమయాలలో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేవారు, పలు కార్యక్రమాల నిమిత్తం ప్రజలు ఆ గ్రామం నుండి రావడానికి, తిరిగి ఆ గ్రామం వెళ్లడానికి నరకయాతన పడ్డారని తెలిపారు. ఎట్టకేలకు జిల్లా పరిషత్తు నిధులు రూ.80 లక్షల మంజూరు చేయడంతో 5 కిలోమీటర్లు బీటీ రోడ్డుకు నిర్మాణం పనులు శరవేగంగా జరగడంతో ప్రజలు ఆనందం చేశారు.


వేగంగా సాగుతున్న భీమోలు రోడ్డు నిర్మాణ పనులు

కల్తీ మాంసం విక్రయాలపై చర్యలు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరంలో నిల్వ మాంసాలు విక్రయంపై సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం రాజమహేంద్రవరం పశుసంవర్ధక శాఖ డిడి కె.సత్యనారాయణ ఎంపిపి కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డిడి సత్యనారాయణ మాట్లాడుతూ మాంసం విక్రయిస్తున్న దుకాణదారులకు ప్రభుత్వం నుండి అనుమతులు పొందిన తర్వాతే మాంస విక్రయాలు జరపాలని తెలిపారు. అనుమతులు లేకుండా మాంసం విక్రయాలు జరిపితే మాంసం అమ్మకం దారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు మాంసం ఆరోగ్యకరంగా ఉందని సర్టిపై చేసిన తర్వాతనే మాంసం విక్రయాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, ఎంపిడిఒ కెవిఎస్ఎస్ఎస్.మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధక శాఖ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిడి సత్యనారాయణ

యానాం వార్తలు


పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఆర్ఎఒ మునిస్వామి, ఇఒ లక్ష్మణ ప్రవీణ్

పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో పదోవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైన సందర్భంగా పరీక్ష కేంద్రాలను ఆర్ఎఒ మునిస్వామి విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ సందర్శించారు. మొత్తం మూడు కేంద్రాలలో 693 మంది హాజరవ్వాల్సి ఉండగా 686 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని,ఏడుగురు పరీక్షకు గైరాజరయ్యారని విద్యాశాఖాధికారి లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు.


బాల్ బ్యాండ్‌మెంటన్ విజేతలు

బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ స్థానం

-స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత చిన్ని కృష్ణ

మహారాష్ట్ర మూర్తి జాపూర్ లో సోమవారం జరిగిన 67వ జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలలో పుదుచ్చేరి బాలుర విభాగంలో యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ నుండి మహారాష్ట్ర జట్టుపై అత్యంత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించినట్లు క్లబ్ సెక్రటరీ కాపగంటి ఆదర్శ శేష సుమన్ సోమవారం తెలిపారు. అదేవిధంగా డబుల్స్, మిక్స్ డబుల్స్ బాలుర విభాగంలో తృతీయ స్థానం కైవాసం చేసుకున్నట్లు తెలిపారు.పెసింగి చిన్నికృష్ణ అనే క్రీడాకారుడు స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును గెలుచుకున్నాడని హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు సహకరించిన కోచ్ బట్ట శ్రీనివాస్, క్రీడాకారులు కర్రీ రమ్య తేజశ్రీ, కాపు అనూష, చింతా వాసు,కర్రీ రాఘవేంద్ర వర్మ, మహ్మద్ జాఫర్ అలీ, జగడం ప్రవీణ్ కుమార్‌లను ఆయన అభినందించారు.